తీరిన రోడ్డు కష్టాలు..

- పాంగ్రి నుంచి చుచుంద్ వరకు పూర్తయిన బీటీ రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


పాంగ్రి నుంచి చుచుంద్ వరకు వేసిన బీటీ రోడ్డు

భైంసారూరల్: మండలంలోని పాంగ్రి నుంచి పునరావాస గ్రామమైన చుచుంద్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదు కిలోమీటర్ల మేర బీటీరోడ్డుకు రూ.3.15కోట్లు మంజూరయ్యాయి. భైంసా–నాందేడ్ ప్రధాన రహదారి ఆనుకుని పాంగ్రి గ్రామం వరకు రెండు కిలోమీటర్లు, పాంగ్రి నుంచి చుచుంద్ వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేశారు. దీంతో రవాణా కష్టాలు పూర్తిగా దూరమయ్యాయి.

విన్నపాలతో పునరావాస గ్రామానికి రోడ్డు..
గడ్డెన్నవాగు ప్రాజెక్టులో చుచుంద్ గ్రామం నీట మునిగింది. దీంతో వాగుకు అవతలివైపు 2004లో పునరావాస గ్రామంగా ఏర్పడిన చుచుంద్‌కు మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగించేవారు. కంకరతేలి గుంతలమయంగా మారిన రోడ్డుపై పదేళ్లు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గ్రావెల్ వేసి చదును చేశారు. కానీ భారీ వర్షాలకు గ్రావెల్ కొట్టుకుపోయింది. గ్రామస్తుల విన్నపాలతో ప్రభుత్వం గతేడాది బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఐదు కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు బీటీ రోడ్డు నిర్మించారు.

తీరిన ఇక్కట్లు...
గ్రామానికి ఒకవైపు గడ్డెన్నవాగు ప్రాజెక్టు బ్యాక్ వాటర్.. మరోవైపు ఐదు కిలోమీటర్ల మేర గుంతలతో కంకరతేలి ఉన్న రోడ్డు ఉండేది. వ్యవసాయం చేస్తూనే జీవనం సాగించే గ్రామస్తులు ప్రతిసారి పంట అమ్ముకునేందుకు తిప్పలు పడేవారు. రోడ్డు సరిగా లేక ఎడ్లబండ్లపైనే పంట భైంసాకు తీసుకొచ్చేవారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు వారంలో ఒక్కసారైనా ఈ రోడ్డుపై బోల్తాపడేవి. ఆసుపత్రి, ఇతర అత్యవసర సమయంలోనూ వాహనాలు గ్రామానికి రావాలంటే ఇబ్బందులే ఎదురయ్యేవి. ఈ బీటీ రోడ్డు నిర్మాణంతో గ్రామానికి ఇక్కట్లు తీరాయి.

కార్తీకమాసంలో..
చుచుంద్ గ్రామంలో ఉన్న పురాతన సిద్ధేశ్వర ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి శ్రావణమాసం, కార్తీకమాసాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుంటారు. ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తవడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది.

కష్టాలు దూరమయ్యాయి


చుచుంద్ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించడంతో గ్రామస్తులు ఇబ్బందులు తీరిపోయాయి. గతంలో కంకర తేలిన రోడ్డుపై మలుపుల వద్ద ప్రమాదాలు జరిగాయి. ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరపడినట్లయింది. గ్రామం వరకు రోడ్డు నిర్మించడంతో రవాణా కష్టాలు దూరమయ్యాయి.
– బోజేందర్, చుచుంద్

పనులు చివరిదశకు చేరాయి

పాంగ్రి నుంచి చుచుంద్ వరకు బీటీ రోడ్డు పనులు చివరి దశకు చేరాయి. ఐదు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డుకు రూ.3.15కోట్లు నిధులు మంజూరయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో సీసీ పనులు చేపట్టాల్సి ఉంది. త్వరలోనే అన్ని పనులు పూర్తవుతాయి.
– ఉదయ్‌కుమార్, పీఆర్ ఏఈ

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ


పాఠశాలలో ప్లేట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సోన్: మండలంలోని జాఫ్రపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆ గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు గ్లాసులు, ప్లేట్లను విరాళంగా అందించారు. మంగళవారం 60 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు రూ.10 వేల విలువైన ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాసామర్థ్యాల గురించి చర్చించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్, భూమయ్య, చిలువేరి బాపు, షేక్ మౌల సాబ్, ప్రధానోపాధ్యాయులు తొడిశెట్టి పరమేశ్వర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

- డీఆర్డీవో విజయలక్ష్మి


మస్కాపూర్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో

ఖానాపూర్: వాతావరణంలో మార్పులు వచ్చినందున ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం వద్దని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని బాదన్‌కుర్తి, మేడంపల్లి, సుర్జాపూర్ గ్రామాల్లోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమ శాతం వచ్చిన తర్వాతే కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో మల్లేశ్ తదితరులున్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి'


మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

ఖానాపూర్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటేలా పార్టీ శ్రేణులు పని చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బూత్‌ల వారీగా బీజేపీకి వచ్చిన ఓటింగ్ సరళిపై సమీక్షించారు. కార్యక్రమంలో నాయిని సంతోష్, టేకు ప్రకాశ్, తోకల బుచ్చన్న, అనిల్‌రావు, పెద్ది రమేశ్, మల్లయ్య, సాయి తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్


ఎమ్మెల్యేకు మిఠాయి తినిపిస్తున్న డీఈవో రవీందర్

భైంసాటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో డీఈవో రవీందర్‌రెడ్డితోపాటు డీఈవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధిపై వారితో చర్చించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యాధికారులు పద్మ, శ్రీదేవి, ఎంఈవోలు సుభాష్, చంద్రకాంత్, మైసాజీ, ముత్తన్న, తదితరులు ఉన్నారు.

'అమరుల కుటుంబాలను ఆదుకోవాలి'
భైంసాటౌన్: ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు డా ముష్కం రామకృష్ణాగౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యే రామారావుపటేల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పలుమార్లు విన్నవించినా గత ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని పేర్కొన్నారు. చాకేటి లస్మన్న, పుండలిక్ రావు, మనోహర్, సాయి సందీప్, రాంరెడ్డి, రాజలింగు, రఘువీర్, కరుణసాగర్, అమరవీరుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆశవర్కర్లు
కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఆశవర్కర్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను కోరారు. మంగళవారం తన నివాసంలో వారిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల సంఘం మండల కన్వీనర్ ఇంద్రమాల, మమత, విజయ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు

- ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్
- స్పెషల్ డ్రైవ్‌లో 50 వాహనాలు స్వాధీనం


లైసెన్సు కోసం స్లాట్‌బుక్ చేయిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: వాహనదారులు చలాన్లు తప్పించుకునేందుకు నంబర్‌ప్లేట్ తొలగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణ సీఐ పురుషోత్తం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 50 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఎస్సైలు మాట్లాడుతూ నంబర్ ప్లేట్లను విరగ్గొట్టిన, తప్పుగా రాసిన ఫోర్జరీ చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. రాంగ్ రూట్లో వెళ్లే వారితోపాటు, సిగ్నల్ జంపు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. కంపెనీతో వచ్చే సైలెన్సర్లను కాకుండా, మార్కెట్లో వచ్చే సైలెన్సర్లను బిగిస్తే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అనంతరం పలువురికి స్లాట్ బుక్ చేయించి లైసెన్స్‌కు దరఖాస్తు చేయించారు. ఇందులో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

'అపరిచితులకు బ్యాంకు వివరాలు చెప్పొద్దు'

లోకేశ్వరం: అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దని లోకేశ్వరం ఏఎస్సై దిగంబర్ పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వేదనిధి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌ను పరిమితంగా వాడుతూ చదువుపై దృష్టి సారించాలన్నారు. బైక్‌లను వేగంగా నడుపొద్దని.. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

సమ్మెబాటలో తపాలా ఉద్యోగులు


సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

నర్సాపూర్(జి): కేంద్రప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని జీడీఎస్ (గామీణ డాక్ సేవక్) ఉద్యోగులు మంగళవారం మండలకేంద్రంలోని ఉప తపాలా కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. కమలేశ్ చంద్ర కమిటీ సిఫారసులను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎనిమిది గంటల పని కల్పించడంతోపాటు తగిన వేతనం ఇవ్వాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజీ రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. వీరికి మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక పోస్ట్‌మాస్టర్ కూన మహేశ్ సంఘీభావం తెలిపారు. ఉద్యోగులు సీహెచ్ దేవన్న, చంద్రమోహన్, లాయక్‌అలీ, సురేఖ, అనురాధ, సరోజవాణి, పోశెట్టి, భీమేశ్, శివకుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించండి

భైంసారూరల్: గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని డీఎల్‌పీఓ శివకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వానల్‌పాడ్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి రోడ్డుపై నీరు నిలవకుండా చూడాలని సూచించారు. పంచాయతీ ట్రాక్టర్ ద్వా రా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలన్నారు. వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ప్రత్యేకాధికారి పర్యటన
కుంటాల: మండలంలోని మెదన్‌పూర్, సూర్యాపూర్ గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక అధికారి మసార్ రావు పర్యటించారు. నర్సరీ, బృహత్, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, సెగ్రిగేషన్‌షెడ్డు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, టీఏ మాధురి, కార్యదర్శులు రాజు, దేవన్న ఉన్నారు.

కనుల పండువగా పడిపూజ


పూజలు చేస్తున్న గురుస్వామి సునీల్‌దత్

తానూరు: మండలంలోని ఎల్విలో మంగళవా రం అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ ఆధ్వర్యంలో వైభవంగా మహాపడిపూజ నిర్వహించారు. ఆష్టాకు చెందిన సునీల్‌దత్ గురుస్వామి నేతృత్వంలో నిర్వహించిన పూజకు సమీప ప్రాంతాలతోపాటు మహారాష్ట్రలోని ధర్మాబాద్, యవతి గ్రామాల భక్తులు తరలివచ్చారు. స్వామివారికి పాలు, పెరుగు, నెయ్యి, పండ్లతో అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావ్ పటేల్ హాజరయ్యారు. గురుస్వామి రమేశ్, సభ జిల్లా ఉపాధ్యక్షుడు కె.కృష్ణ, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి బీఆర్‌ఎస్ ఎంపీటీసీ


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: మండలంలోని హనుమాన్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యుడు రాథోడ్ రాజు మంగళవారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. విలాస్, రాజేందర్‌రెడ్డి, రాజురెడ్డి, సాగర్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా

- సమస్యలుంటే నేరుగా సంప్రదించండి
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


ఖానాపూర్‌లో విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి నిరుపేదను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం మంగళవారం తొలిసారి ఖానాపూర్‌కు వచ్చిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు సమస్యలుంటే మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తానని హామీ ఇచ్చారు. అవినీతి, అక్రమాలకు దూరం ఉంటూ ప్రజలకు సేవ చేస్తానన్నారు. సదర్మాట్, కడెం ప్రాజెక్టు సమస్యలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రతీ మండలానికి వారంలో రెండు రోజులు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ, తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంతి భవనంలో ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో దయానంద్, చిన్నం సత్యం, నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, యూసుఫ్‌ఖాన్, మజీద్, తోట సత్యం, గంగసర్సయ్య, అమానుల్లా ఖాన్, షౌకత్‌పాషా, జహీర్ అహ్మద్, తిలక్‌రావు, శేషాద్రి, బల్గం రవీందర్, మహేశ్, చిన్నం రవి, రాజు, రాజేశ్వర్, జహీర్, తదితరులు ఉన్నారు.

పెంబి మండలంలో..
పెంబి: అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు మందపల్లిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిశీలించి వైద్యాధికారుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, శంకర్, దేవేందర్ రెడ్డి, అశోక్‌రావు, రమేశ్, లింగన్న, రాజన్న, శంకర్ తదితరులు ఉన్నారు.

నిల్వనీటిని పారబోయండి

లక్ష్మణచాంద: పరిసరాల్లో రోగాలు ప్రబలకుండా నిల్వనీటిని పారబోయాలని మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పార్‌పెల్లిలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పలువురి ఇళ్ల వద్ద ఉన్న నిల్వనీటిని పారబోయించారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

పెంబి: పెంబి మండల లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని మంగళవారం ఖానాపూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుదర్శన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెంబి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మందపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తామని పేర్కొన్నారు. పెంబి క్లబ్ కార్యదర్శి వెంకన్న, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు రవీందర్ ఉన్నారు.

కడెంలో 'మహాలక్ష్మి' కోసం నిరీక్షణ


కడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మీ' పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కడెం మండల కేంద్రం నుంచి నిర్మల్, మంచిర్యాల రూట్లలో ఆర్టీసీ బస్సులు చాలా తక్కువ. గతంలో ప్రయాణికులు బస్సు కోసం ఎదురు చూడకుండా ప్రైవేటు వాహనాల్లో వెళ్లేవారు. కానీ ఉ చిత బస్సు ప్రయాణం ప్రారంభించినప్పటి నుంచి గంటల తరబడి వేచి చూసి మరీ ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు.

'ఎంపీ సాహును అరెస్ట్ చేయాలి'


మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ ప్రసాద్ సాహును వెంటనే అరెస్ట్ చేసి అతడి సభ్యత్వాన్ని రద్దు చేయాలని జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి మాట్లాడారు. రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడైన ధీరజ్‌సాహు మద్యం అమ్మకాలతో పేదలను దోచి భారీగా ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. ఐటీ దాడుల్లో అధికారులు సుమారు రూ.350 కోట్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వెంటనే అతడిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కడెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కడెం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరవాలని కోరారు.

ఉపాధి కల్పించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్లు

కుంటాల: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుండటంతో తాము ఉపాధి కోల్పోయామని.. తమను ఆదుకోవాలని ఆటోడ్రైవర్లు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అప్పులు చేసి ఆటోలను కొంటే గిరాకీ తగ్గిందని.. ఫైనాన్స్ చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దొనికెన వెంకటేశ్, ఆటోడ్రైవర్లు గజేందర్, రవి, నాగరాజు, సల్మాన్, రాములు, రవిగౌడ్, మల్లేశ్, ఖయ్యూం పాల్గొన్నారు.

16లోగా రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

లోకేశ్వరం: కొత్తగా వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు రైతుబంధు కోసం ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏవో గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్‌లను అందించాలని వారు సూచించారు.

బాధిత కుటుంబానికి సాయం

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన వెల్పుల గంగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మానవ సేవే..మాధవ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శెట్‌పెల్లి మహేందర్.. ఫౌండేషన్ సభ్యుల ద్వారా బాధిత కుటుంబానికి రూ.ఐదు వేలు అందించారు. రమేశ్, శ్రీను, పవన్, రమేశ్, మధు, అంజన్న, భూమేశ్ తదితరులున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని బీఎల్‌వోలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ మంజుల మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి 5వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ, ఓటరు కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్ఐ రాజేశ్వర్, ఆయా గ్రామాల బీఎల్‌వోలు ఉన్నారు.

బీసీ గణన చేపట్టాలి

ముధోల్: తెలంగాణలో బీసీల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఏయే కులాల్లో ఎందరు బీసీలు ఉన్నారనే విషయాన్ని లెక్కలతో వివరించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలంటే బీసీ జనగణన తప్పనిసరి అని డిమాండ్ చేశారు.

పాఠశాల సందర్శన


మాట్లాడుతున్న అశోక్‌వర్మ

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం మండల నోడల్ అధికారి అశోక్‌వర్మ, రూమ్ టు రీడ్ మండల కోఆర్డినేటర్ గోవర్ధన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ అమలు, విద్యార్థుల వర్క్‌బుక్స్, ఉపాధ్యాయుల డైరీ పరిశీలించారు. అనంతరం తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో బేస్ లైన్ టెస్ట్, వాటి ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో ఐదు రోజుల పాఠ్యాంశాల బోధన, ఒకరోజు మూల్యాంకనంపై సమీక్షించారు. రోజు లైబ్రరీ పీరియడ్ నిర్వహించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామసభ

తానూరు: మండలంలోని ఝరి(బి)లో మంగళవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభ నిర్వహించారు. 2022–23కి సంబంధించిన ఉపాధి పనులు మూడు రోజులు పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి కూలీల జాబ్‌కార్డుల వివరాలు నమోదు చేసుకున్నారు. నమోదు చేసిన వివరాలను తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలో వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌పీ మహేశ్, టీఏ రమణగౌడ్, ఎఫ్ఏ ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.